www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 4 డిసెంబర్ 2025

13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - తణుకు

ఈ నెల 13వ తేదీన రాష్ట్రం మొత్తం జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్, నాలుగో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. బుధవారం స్థానిక కోర్టు హాల్లో కోర్టు పరిధిలో పనిచేసే పోలీసు అధికారులతో, బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి సత్యవతి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో పోలీసులు, న్యాయవాదులు ఎక్కువ కేసులు రాజీ చేయడానికి కృషి చేయాలని కోరారు. ఈ లోక్ అదాలత్‌లో అన్ని రాజీపడు క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్, ప్రోనోటు, కుటుంబ తగాదా, ప్రీ లిటిగేషన్ కేసులు, బ్యాంకు బకాయిలు, టెలిఫోన్ బిల్లు బకాయి కేసులు రాజీ చేసుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో న్యాయమూర్తులు కె.కృష్ణసత్యలత, పి.సాయిరాం, కె.కృష్ణవేణి, తాడి ఆంజనేయులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూరంపూడి కామేష్ పాల్గొన్నారు.

ఖరీఫ్ దిగుబడి ఉఫ్..!

అన్నదాతల గుండెల్లో తుపాన్లు

వీడని వర్షం, చిరుగాలులు

చైన్ ట్రాక్ యంత్రాలకు భారీ డిమాండ్

అమాంతం పెరిగిన యంత్రాల అద్దెలు

అదరపు భారంతో తల్లడిల్లుతున్న రైతులు

ట్రైన్ చైన్ ట్రాక్ యంత్రం ద్వారా కోసిన ధాన్యాన్ని ట్రాక్టర్లోకి ఎగుమతి చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఆచంట

ఆరుగాలం శ్రమ ఆవిరైపోయింది. ఖరీఫ్‌లో ధాన్యం దిగుబడి పడిపోయింది. పెట్టుబడి ఖర్చులైనా రాకపోవడంతో అన్నదాతకు దిగులు పట్టుకుంది. చేతికొచ్చిన పంట ఇంటికొచ్చే పరిస్థితి లేకుండాపోయింది. వాతావరణంలో పలు మార్పులు సంభవించడం అక్కడక్కడా చిరుజల్లులు కురవడం, పంట పొలాలు ఆరకపోవడం తేమశాతం పెరిగిపోవడంతో ధాన్యం పంట పొలాల్లోనే ఉండి మొలకెత్తే పరిస్థితి నెలకొంది. ప్రతిసారీ టైర్ల మిషన్ యంత్రాలతో కోతలు పూర్తయ్యేవి. ఈ తరుణంలో పొలాల్లో తేమ అధికంగా ఉండడంతో అవసరమైన చైన్ ట్రాక్ మిషన్లు లేకపోవడంతో కోతకు ఇబ్బంది కలుగుతుంది. దీంతో మిషన్లకు బాగా డిమాండ్ పెరిగింది. చైన్ ట్రాక్ మిషన్లు యజమానుల దగ్గరకు వెళ్లి రైతులు బతిమాలుకునే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు ధాన్యం మొలకలు వచ్చే పరిస్థితి ఉండటంతో ట్రాక్ మిషన్లకు బాగా డిమాండ్ పెరిగింది. దీంతో రైతులకు అదనపు భారంగా మారింది. వరి కోతల ఖర్చు గతంలో రూ.20 వేలు ఉంటే ప్రస్తుతం రూ.30 వేలు వరకు పెరిగింది. దీంతో అన్నదాతకు నష్టాలు మిగిలాయి.

తాజాగా ఖరీఫ్ పంట చేతికి వచ్చిన సమయంలో దిత్వా తుపాన్ రైతులను కలవరపెడుతుంది. మంగళవారం ఉదయం నుంచి వాతావరణం మేఘావృతమై చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. 50 శాతం పొలాల్లో కోతలు పూర్తవ్వగా, ధాన్యమంతా చాలావరకూ రోడ్డుపక్కన కళ్లాలో ఉండిపోయింది. మొంథా తుపాన్ కారణంగా పంట పొలాలకు వైరస్ సోకడంతో దిగుబడి గణనీయంగా పడిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు 35 బస్తాలు దిగుబడి రావాల్సి ఉండగా ప్రస్తుతం 20 నుంచి 25 బస్తాల వరకు దిగుబడి వస్తుందని చెబుతున్నారు.

పంటను కాపాడుకునేందుకు నానాపాట్లు

ప్రస్తుత తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు అనేక విధాలుగా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే కౌలురైతులు రోడ్ల వెంబడి ధాన్యం ఆరబెట్టుకుంటున్నారు. ప్రస్తుతం 17 శాతం నిబంధన విధించడంతో మూడు నుంచి నాలుగు రోజులపాటు ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అదనపు ఖర్చులు తప్పడం లేదని వాపోతున్నారు. దిత్వా తుపాన్ కారణంగా తేమశాతం మరింత పెరిగి రైతులకు మరింత నష్టం వాటిల్లుతుందని లబోదిబోమంటున్నారు.

ఆచంటలో వైరస్ సోకిన వరిచేను

పెట్టుబడులు పెరిగిపోయాయి..

ఆరుపల్లి శ్రీను, కౌలురైతు, ఆచంట

ఖరీఫ్ సాగులో అనూహ్యంగా పెట్టుబడులు పెరిగిపోయాయి. మొంథా తుపాన్ కారణంగా పంట పొలాలు ఆరకపోవడంతో టైర్ల యంత్రాలు దిగిపోతున్నాయి. దీంతో ట్రాక్ చైన్ యంత్రాలను వినియోగించి పంటను కోయిస్తున్నారు. దీంతో గంటకు రూ.3,500 వరకు ఖర్చవుతుంది. ప్రకృతి విపత్తులు ఈసారి రైతులను బాగా దెబ్బతీశాయి. కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఉంది.

కౌలుకు సాగు కష్టమే..

చిట్టూరి సత్యనారాయణ, కౌలు రైతు, ఆచంట

ప్రస్తుత పరిస్థితుల్లో వరి పంట సాగు చేయటం కష్టంగా మారింది. ప్రతి ఏడాది క్రిమిసంహారక మందులు కాంప్లెక్స్ ఎరువుల ధరలు కూలీల ధరలు ట్రాక్టర్ అద్దె ధరలు పెరుగుతున్నాయి. గతంలో ఎకరానికి రు 15 వేలు ఖర్చు చేసేవాళ్ళు ప్రస్తుతం రు ఎకరానికి 30 వేలు పైగా ఖర్చు అవుతుంది. ఇలాగైతే వ్యవసాయం చేయడం కష్టం. యంత్రాలకు ధరలు పెరిగిపోయి రైతుకు ఏమి మిగలడం లేదు.

విపత్తులతో నష్టాలు

సూరిశెట్టి పుల్లయ్య, కౌలు రైతు, ఆచంట

వరుస విపత్తులతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికే అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాం. ప్రభుత్వ విధానాల వల్ల పెరుగుతున్న ఎరువులు, పురుగుమందుల ధరలు, రైతులకు మద్దతు ధర దక్కకపోవడంతో సాగు భారంగా మారింది. ఖరీఫ్‌లో పెట్టుబడులు అధికమయ్యాయి. పంట చేతికొచ్చిన సమయంలో ఎకరానికి 20 బస్తాలు మించి దిగుబడి రావటం లేదు. ఈ పరిస్థితుల్లో కనీసం సాగు ఖర్చులు కూడా రాని పరిస్థితి.

ప్రభుత్వమే ఆదుకోవాలి

చిట్టూరి శ్రీను, కౌలు రైతు, ఆచంట

మొంథా తుపాన్ కారణంగా పంట పొలాలకు వైరస్ సోకింది. దీంతో ఎకరానికి 20 బస్తాలకు మించి దిగుబడి రావడం లేదు. ఎకరానికి రూ.30 వేలు పెట్టుబడులు పెట్టాను. చివరికి రైతుకు కౌలు కూడా చెల్లించుకోలేని పరిస్థితి నెలకొంది. ఇలాగైతే వ్యవసాయం వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వమే ఆదుకోవాలి.



వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

వైద్య సేవలు వినియోగించుకోవాలి

పెనుగొండ సిహెచ్‌సిలో కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండ సామాజిక ఆరోగ్య కేంద్రం సేవలు ఉత్తమంగా ఉన్నాయని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం ఆమె పెనుగొండ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రసవాలు ఎన్ని జరుగుతున్నాయి, సర్జరీలు చేస్తున్నారా, ఎక్సరేలు తీస్తున్నారా, యాంటీ బయోటిక్ మందులు ఉన్నాయా, స్పెషలిస్ట్ వైద్యులు ఎంతమంది ఉన్నారు, సమయ పాలన పాటిస్తున్నారా, పరీక్షలు అన్నీ చేస్తున్నారా, డెలివరీలు ఎన్ని చేశారు, వైద్య పరీక్షలు ఎన్ని చేశారు, టైఫాయిడ్, సుగర్, సిబిపి తదితర టెస్టులన్నీ చేస్తున్నారా అని ప్రశ్నించారు. వైద్యులు, సిబ్బంది సమాధానాలకు సంతృప్తి చెందారు. డెంటల్ డాక్టర్ కూడా ఉన్నారని తెలియడంతో, దంత పరీక్షలు, చికిత్స నిర్వహిస్తున్నారా అని ప్రశ్నించారు. అనంతరం స్త్రీల ప్రసూతి వార్డు, మేల్ వార్డు, ఫిమేల్ వార్డు, ఆయుష్ క్లినిక్, ల్యాబ్, రక్త పరీక్షల గది, మరమ్మతుల్లో ఉన్న స్త్రీల మరుగుదొడ్లు తదితర విభాగాలను అన్నింటినీ స్వయంగా పరిశీలించి, చికిత్స పొందుతున్న రోగులతోను, ప్రసూతి మహిళలతోనూ మాట్లాడారు. హాస్పిటల్లో సౌకర్యాలు ఎలా ఉన్నాయి, వైద్యులు బాగా చికిత్స చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. రోగులు కూడా ఆసుపత్రిలో అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వైద్యులతో మాట్లాడుతూ హాస్పటల్ అభివృద్ధి కమిటీ ఉందా అని ప్రశ్నించారు. లేదని చెప్పడంతో వెంటనే హాస్పిటల్ అభివృద్ధి కమిటీ నియమించాలని ఆదేశించారు. హెచ్‌డిఎస్ ఫండ్స్‌ను హాస్పటల్ అభివృద్ధికి ఖర్చు చేయాలని తెలిపారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలు, అవసరమైన వైద్యులు ఉన్నారని సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయి వైద్య సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను వివరించాలన్నారు. తద్వారా వారు సిహెచ్‌సిలో అందిస్తున్న సేవలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తారన్నారు. సిహెచ్‌సిలో పీడియాట్రిషియన్, గైనకాలజిస్ట్, ఫిజియోథెరపీ, ఎనస్థీషియా, ఎంఎస్ జనరల్, డెంటల్, జనరల్ సర్జన్, ఆయుష్ తదితర విభాగాల డాక్టర్లు అందుబాటులో ఉన్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఒ దాసి రాజు, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పి.సూర్య నారాయణ, సిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.రాంబాబు, తహశీల్దార్ జి.అనితకుమారి, వివిధ విభాగాల వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి

ఎన్‌జిఒ జిల్లా అడహక్ కమిటీ ఛైర్మన్‌గా పాండురంగారావు - ఎపి ఎన్‌జిఓస్ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్‌రావు



మాట్లాడుతున్న ఎన్‌జిఒ నేత

ప్రజాశక్తి - భీమవరం టౌన్

70 సంవత్సరాల కాలంలో ఎపి ఎన్‌జిఒ ఉద్యోగుల సంఘం ఎన్నో విజయాలు సాధించిందని, సంఘాన్ని మరింత బలోపేతం చేసుకోవడం ద్వారా మరిన్ని సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు ఆలపర్తి విద్యాసాగర్ అన్నారు. బుధవారం స్థానిక త్యాగరాజ భవనంలో ఎన్‌జిఒ జిల్లా శాఖ సమావేశం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథులుగా విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డివి.రమణ, పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రాజారామ్మోహన్‌రాయ్‌తోపాటు ఉద్యోగ సంఘాల నాయకులు, ఎన్‌జిఒ నేతలు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉద్యోగులకు రావాల్సిన డిఎ, పిఆర్‌సిలను ఇవ్వకుండా, ఒపిఎస్ తీసుకొచ్చి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక లోకాన్ని తీవ్ర అగాధంలోకి నెట్టారన్నారు. గత ప్రభుత్వ హయాంలో కనీసం జీతం సమయానికి వస్తే చాలనే స్థాయికి దిగజార్చారన్నారు. 20 లక్షల హెల్త్ కార్డులు ఉంటే ముగ్గురు మాత్రమే డాక్టర్లు ఉన్నారని, దీంతో వేలకు వేలు కార్డులు పెండింగ్లో ఉండిపోతున్నాయని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇసిహెచ్ హాస్పిటల్‌లో 46 మంది డాక్టర్లను అపాయింట్ చేయించామన్నారు కేరళ, తమిళనాడు, పంజాబ్, రాష్ట్రాలు మాదిరిగా ప్రతి ఉద్యోగ కుటుంబానికి హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్ తీసుకురావాలని కోరుతున్నామన్నారు. 2004లో కాంట్రాక్ట్ ఉద్యోగులను 10,280 మందిని క్రమబద్ధీకరిస్తామని చెప్పి కేవలం 2,800 మందిని మాత్రమే క్రమబద్ధీకరించారని, మిగిలిన వారిని క్రమబద్ధీకరించాలని కోరారు.

ఉద్యమాలను అణిచేస్తే అధికారానికి దూరమే

పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి

గత ప్రభుత్వం ఉద్యోగులను నట్టేట ముంచిందని, దీనిపై ఉద్యోగ సంఘాలు ఆందోళనలు చేపడితే ఉద్యమాన్ని అణిచేసే ప్రయత్నం చేసిందని పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి గుర్తు చేశారు. ఉపాధ్యాయ నేతలను సైతం పోలీసులతో ముందస్తు అరెస్టులు, గృహనిర్బంధం చేయించారని విమర్శించారు. ఫ్యాప్టో ఉద్యమంలో భాగంగా సిపిఎస్ రద్దుకు విజయవాడలో చేపట్టిన ఆందోళనకు ఎన్‌జిఒలు వేలాదిగా మద్దతిచ్చి ప్రభుత్వానికి చుక్కలు చూపించారన్నారు. ఈ నేపథ్యంలోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, అయితే ప్రభుత్వం ఏర్పడి 18 నెలలవుతున్నా సమస్యలు మాత్రం పరిష్కరించడం లేదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలను అంతా ఖండించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.రాజారామ్మోహన్‌రాయ్ అన్నారు. లేబర్ కోడ్‌లను అంతా వ్యతిరేకించాలని కోరారు. ఎపి ఎన్‌జిఒ సంఘానికి సిఐటియు పూర్తి మద్దతిస్తుందని ప్రకటించారు.

ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు

జిల్లా అడ్‌హక్ కమిటీ ఎన్నిక

జిల్లా అడ్‌హక్ కమిటీ ఛైర్మన్‌గా ఉదిసి వెంకట పాండురంగారావు, సభ్యులుగా పోతన సుకుమార్, అల్లూరి శ్రీనివాసరాజు, ఎంఆర్‌కె.రాజు, దేవాబత్తుల నాగదేవి, ఇంజేటి రమేష్, సుంకర వెంకటేష్ పేర్లను ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెనుమరెడ్డి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శులు శివప్రసాద్, రాంప్రసాద్, జెఎసి నేతలు ఆర్‌ఎస్.హరనాధ్, రాష్ట్ర ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు పాము శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డి రమణారెడ్డి, రాష్ట్ర ఉమెన్ వింగ్ ఉపాధ్యక్షురాలు తోట కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

భారీ ర్యాలీ

తొలుత పాత బస్టాండ్ నుండి అంబేద్కర్ సెంటర్, ప్రకాశం చౌక్, తాలూకా ఆఫీస్ రోడ్డు మీదుగా సభా వేదికైన త్యాగరాజ భవనం వద్దకు చేరుకున్నారు.

డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా నేతలు

గంజాయి, మత్తు పదార్థాలను అరికట్టాలి

డిఆర్‌ఒకు ఐద్వా జిల్లా నేతల వినతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాలను అరికట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) డిమాండ్ చేసింది. స్థానిక కలెక్టరేట్లో డిఆర్ఒ శివన్నారాయణరెడ్డికి ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో పెంచలయ్య గంజాయి మత్తు పదార్థాలు వాడొద్దని యువతను జాగృతం చేస్తున్నాడని గంజాయి ముఠా అతి దారుణంగా కన్నబిడ్డల ముందే నరికి చంపిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచలయ్య కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోనూ గంజాయి, మత్తు పదార్థాలు విచ్చలవిడిగా అమ్ముడవుతున్నాయని, దీనివల్ల యువత చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బాలికలు, మహిళలపై అత్యాచారాలు పెరుగుతున్నాయని, వీటిని అరికట్టాలంటే గంజాయి మత్తు పదార్థాలను అరికట్టాలని కోరారు. జిల్లా అధ్యక్షురాలు ఎస్.ఉదయకుమారి, ఉపాధ్యక్షులు కేతా పద్మజ, భీమవరం పట్టణ అధ్యక్షురాలు బి.వరలక్ష్మి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బంది లేకుండా చర్యలు

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

మాట్లాడుతున కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - పెనుగొండ

ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బంది లేకుండా జిల్లా యంత్రాంగం అన్ని చర్యలూ చేపట్టిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలోని రైతులకు రూ.3.5 కోట్లు విలువైన వ్యవసాయ పనిముట్లను సబ్సిడీపై అందించినట్లు వివరించారు. అధికంగా ఎరువుల వాడకం తగ్గించాలని, దిగుబడులను పెంచుకోవాలని సూచించారు. బుధవారం స్థానిక టిటిడి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన రైతన్నా.. మీకోసం గ్రామస్థాయి కార్యాచరణ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ఖరీఫ్‌లో ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జిల్లాలో 42 డ్రోన్లు సబ్సిడీపై ఇచ్చామని తెలిపారు. ప్రభుత్వం రైతుల కోసం తీసుకొచ్చిన రైతన్నా మీకోసం యాప్‌ను ప్రతిఒక్కరూ ఇన్‌స్టాల్ చేసుకుని సమాచారం, ప్రయోజనాలను పొందాలన్నారు. టిడిపి నేత పితాని వెంకట్ మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్ని విధాలుగా రైతులను ఆదుకుంటామని అన్నారు. కాల్వల్లో పూడికతీత పనులను నీటిసంఘాల ద్వారా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒ దాసి రాజు, సర్పంచి శ్యామల, నీటిసంఘం ప్రెసిడెంట్ జక్కంశెట్టి సత్యనారాయణ, మార్టేరు వ్యవసాయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త శ్రీనివాసరావు, జనసేన నేత శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌కెల్లో ధాన్యం విక్రయించండి

పెనుమంట్ర: జిల్లాలో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలుకు పటిష్ట ఏర్పాట్లు చేశామని, రైతులు ఆర్‌ఎస్‌కెల్లో ధాన్యం అమ్మకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం వెలగలేరు గ్రామ పంచాయతీ పరిధిలోని మార్టేరు-బ్రాహ్మణచెరువు ప్రధాన రహదారిపై నిల్వ చేసిన ధాన్యం రాశులను ఆమె పరిశీలించి కొద్ది సమయం రైతులతో మాట్లాడారు. గోనె సంచుల నాణ్యత, ధాన్యం రవాణా సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు, రైతుసేవా కేంద్రాల పనితీరు, అధికారుల అందుబాటు సేవలు పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. రైస్‌మిల్లుల వద్ద ఎలాంటి సమస్యలు ఎదురైనా తక్షణమే స్థానిక అధికారులకు తెలియజేయాలని ఆమె సూచించారు. సొసైటీల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని రైతులు వినియోగించుకోవాలని చెప్పారు. దళారులను నమ్మి మోసపోవద్దని రైతులను హెచ్చరించారు. రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని, రైతుల సమస్యలు తక్షణ పరిష్కారం, నాణ్యమైన సేవలే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పని చేస్తుందని తెలిపారు.

సాగులో సాంకేతికతను జోడించాలి

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - అత్తిలి

రైతులు వ్యవసాయం, పాడి పరిశ్రమ, ఆక్వా, హార్టికల్చర్, రంగాల్లో నూతన సాంకేతికతను జోడించి ఆదాయం పెంచుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. సేంద్రియ పద్ధతిలో ఆరోగ్యకరమైన పంటలు పండించాలన్నారు. బుధవారం స్కిన్నెరపురంలో యర్రా నారాయణస్వామి కళ్యాణ మండపంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా గ్రామస్థాయి కార్యాచరణ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వ్యవసాయ కార్యాచరణ ప్రణాళికకు సంబంధించి రైతులతో మాట్లాడారు. వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందే విధంగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. డ్రోనులు ఉపయోగించి పెట్టుబడి తగ్గించాలన్నారు. పొలం గట్లు, దిబ్బలు, ఇంటి వద్ద ఖాళీ స్థలాల్లో కూరగాయలు పెంచి వాటి ద్వారా ఆదాయం పెంచుకోవాలని సూచించారు. అన్ని రంగాల్లో ఏ సమయంలో, ఏ పంటలు రైతులకు లాభసాటిగా ఉంటాయో తెలుసుకుని వాటి ద్వారా రైతులు ఆదాయం పెంచుకోవాలన్నారు. ఏ రంగాల ద్వారా ఎంత ఆదాయం వస్తుందనేది రైతులకు వివరించారు. ఎక్కువ ఆదాయం వచ్చే పద్ధతులపై మొగ్గు చూపాలని జెసి సూచించారు. అనంతరం రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. గోనె సంచులు, బరకాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. దిత్వా తుపాన్ వల్ల కురుస్తున్న వర్షాల కారణంగా రైతులు తమ ధాన్యాన్ని తడవకుండా భద్రపరుచుకోవాలని సూచించారు. రైతులు ప్రయివేటుగా బరకాలను అద్దెకు తెచ్చుకుంటే సొసైటీల ద్వారా అద్దె చెల్లించాలని సొసైటీ అధికారులను ఆదేశించారు. గ్రామంలో రోడ్డు పక్కన ధాన్యం ఆరబెట్టుకున్న రైతుతో జెసి మాట్లాడి, ధాన్యం పరిశీలించారు. తేమ శాతం ఎంత ఉందని ఆరా తీశారు.



రైతులతో మాట్లాడుతున్న జెసి రాహుల్‌కుమార్ రెడ్డి

రేషన్ దుకాణం ఆకస్మిక తనిఖీ

స్కిన్నెరపురంలో 33 నెంబర్ రేషన్ దుకాణాన్ని మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో ఇ-పాస్ మిషన్ ద్వారా రేషన్ సరుకులు పంపిణీ విధానాన్ని స్వయంగా ఆయన పరిశీలించారు. ప్రతి నెలా రేషన్ సరుకులు సక్రమంగా అందుతున్నాయా, లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎంవి.రమేష్, తహశీల్దార్ దశిక వంశీ, మండల వ్యవసాయ శాఖాధికారి టి.రాజేష్, వెటర్నరీ, ఫిషరీస్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న పట్టణ సిఐ ఆదిప్రసాద్

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తిరుపతిలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో ఎస్‌ఎఫ్‌ఐ 25వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మణ్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పట్టణ సిఐ బి.ఆదిప్రసాద్ చేతుల మీదుగా మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ సహాయ కార్యదర్శి లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి తాడికొండ రవి మాట్లాడుతూ ఈ నెల 12న తిరుపతిలో ర్యాలీ నిర్వహించి, ఇందిరా మైదానంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో వేలాదిగా విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అలాగే జిల్లా మహాసభ తాడేపల్లిగూడెంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యారంగ సమస్యలపై మహాసభలో చర్చిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ ఉపాధ్యక్షుడు గణేష్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి సిపిఎం నేతల పరామర్శ

ప్రజాశక్తి - యలమంచిలి

చించినాడ గ్రామంలో పలు కుటుంబాలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం, సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, సిపిఎం జిల్లా నాయకులు బాతిరెడ్డి జార్జి అరుంధతి పేట, శెట్టిబలిజపేట, పెదపేటకు చెందిన పార్టీ కార్యకర్తలు సానుభూతిపరులు మొమ్మిడివరపు ఈశ్వరుడు, తెన్నేటి సంపతరావు, తెన్నేటి వెంకటేశ్వరరావు, గోగినేని బేబీరేఖ, చిందపు లక్ష్మి, కేతా రాము, కానేటి ఆదిలక్ష్మి పలు అనారోగ్య సమస్యలతో వైద్యం చేయించుకుని ప్రస్తుతం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. వారిని నాయకులు పరామర్శించి ధైర్యం చెప్పారు. వారి వెంట సిపిఎం నాయకులు దేవ సుధాకర్, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, తెన్నేటి స్టాలిన్, పల్లేరు వెంకటస్వామి తదితరులు ఉన్నారు



పరామర్శిస్తున్న సిపిఎం నేతలు

గేటు మూసివేతతో అవస్థలు.

రాత్రి వేళల్లోనైనా గేటు తీయాలని ప్రయాణికుల ఆవేదన

ప్రజాశక్తి - ఉండి

ఆర్‌ఒబి నిర్మాణ పనుల్లో భాగంగా ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయకుండా రైల్వే గేటు మూసివేయడంతో ప్రయాణికులు, ద్విచక్ర, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పలువురు మాట్లాడుతూ రాత్రి వేళల్లో నిర్మాణ పనులు జరగకపోవడంతో రాత్రి వేళల్లోనైనా గేటు తెరవాలని పలువురు ప్రయాణికులు ఫ్లైఓవర్ నిర్మాణ ప్రతినిధులతో మాట్లాడారని, అయితే ప్రయాణికులతో ఆర్‌ఒబి నిర్మాణ ప్రతినిధులు దురుసుగా మాట్లాడటం సరికాదని వాపోతున్నారు. ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయకుండా జాతీయ రహదారిని దిగ్బంధం చేయడం సరికాదని పలువురు ప్రయాణికులు ఆర్‌ఒబి ప్రతినిధులతో వాగ్వాదానికి దిగారు. బుధవారం సైకిల్ వెళ్లే మార్గం కూడా లేకుండా దిగ్బంధనం చేయడంతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

మాట్లాడుతున్న పేరిచర్ల మురళీకృష్ణంరాజు

వికలాంగులను ఆదుకోవాలి

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

వికలాంగులను ఆదుకోవాలని లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు అన్నారు. స్థానిక భవిత వికలాంగుల శిక్షణ కేంద్రంలో బుధవారం పేరిచర్ల ఫౌండేషన్ చైర్మన్ లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో అంతర్జాతీయ వికలాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగ విద్యార్థులకు కుర్చీ పరుగు పందెం, క్యారమ్స్, మ్యూజికల్ చైర్స్, బాల్ త్రో, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. పేరిచర్ల మాట్లాడుతూ వైకల్యం శరీరానికి గాని మనసుకు కాదన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సాధారణ పిల్లలతో సమానంగా వికలాంగ పిల్లలను గౌరవించాలన్నారు. ఫౌండేషన్, డైమండ్స్ లయన్స్ క్లబ్ తరపున పిల్లల అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్.కె.బాల ఈశ్వరయ్య మాట్లాడారు. జొన్నల సతీష్ కుమార్, ఆకుల సతీష్ నాయుడు, మేకల మృత్యుంజయకుమార్, భవిత వికలాంగ పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్వాతంత్రం వచ్చి 79 సంవత్సరాలైనా వికలాంగుల తలరాతలు మారలేదని వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు మేడపాటి వీర వెంకట రాఘవేంద్ర రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక గొల్లగూడెం సెంటర్లోని రంగా బొమ్మ సెంటర్ వద్ద వికలాంగుల దినోత్సవ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం సంఘం నాయకులు మేడపాటి వీర వెంకట రాఘవేంద్ర రెడ్డి, కొత్త వీర రాజు, పులిమి లక్ష్మణరావు మాట్లాడారు.

నరసాపురం : అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా రుస్తుంబాద గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద న్యాయ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచి బి.భారతి అధ్యక్షత వహించారు. నరసాపురం మండల న్యాయ సేవాధికారి సంస్థ సభ్యులు చల్లా దానయ్య నాయుడు, బార్ అసోసియేషన్ కార్యదర్శి వి.ప్రకాశ్‌రావు, ప్యానెల్ లాయర్ కె.శిరీష పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వికలాంగుల చట్టం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి సోఫియా, పంచాయతీ కార్యదర్శి పి.శేఖర్‌బాబు, ప్యానెల్ లాయర్ ఆనంద్ బాబు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి – మొగల్తూరు

అన్నదాతలకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలపడాలని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరు రామరాజు అన్నారు. రైతన్న మీకోసం గ్రామ సభలను అన్ని రైతు సేవా కేంద్రాల్లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా పేరుపాలెంసౌత్‌లోని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ మండల అధికారి అబ్దుల్ రహీమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అన్నదాతల అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ మాట్లాడుతూ రైతులకు ఉద్యాన పంటల సాగు నిమిత్తం ప్రతి రైతుకూ వ్యవసాయ యంత్ర పరికరాలను ప్రభుత్వం రాయితీపై అందిస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు కడలి సోంబాబు, పేరుపాలెం వెంకన్న, మాజీ సర్పంచి మేళం బన్ను, టిడిపి నేతలు పాల్గొన్నారు.

ఎస్‌వికెపి గోల్డెన్ జూబ్లీ వేడుకల కమిటీకి ఆరుగురు ప్రతినిధులు ఎంపిక

ప్రజాశక్తి – పెనుమంట్ర

పెనుగొండ ఎస్‌వికెపి విద్యాసంస్థలో వచ్చే సంవత్సరం జనవరి 10 నుంచి 12వ తేదీ వరకూ మూడు రోజులు జరిగే గోల్డెన్ జూబ్లీ వేడుకలకు ఏర్పాటు చేసిన ఓల్డ్ స్టూడెంట్స్ కమిటీలో పెనుమంట్రకు చెందిన ఆరుగురు ప్రతినిధులు ఎంపికయ్యారు. వీరిలో మార్టేరుకు చెందిన ప్రముఖ అంతర్జాతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు, నరసాపురం ఆర్‌టిసి డిపో మానేజర్ సత్తి సుబ్బన్న రెడ్డి, మార్టేరు సర్పంచి కర్రి వేణుబాబు, మార్టేరు హైస్కూల్ విశ్రాంత పీడీ కర్రి కృష్ణారెడ్డి, నెగ్గిపూడికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు పాలా ప్రసాద్, కడలి సుబ్రహ్మణ్యం, సత్యవరానికి చెందిన విద్యా వేత్త డాక్టర్ ఉన్నమట్ల మునీశ్వరరావు (మునిబాబు) ఉన్నారు. వీరిని కళాశాల పాలక మండలి ప్రతినిధులు, స్థానికులు అభినందించారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

పాలకోడేరు సొసైటీ అధ్యక్షులు కొత్తపల్లి నాగరాజు

ప్రజాశక్తి – పాలకోడేరు

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి, రైతులకు ఆర్థిక తోడ్పాటు అందించేందుకు కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలబడిందని పాలకోడేరు సొసైటీ అధ్యక్షులు కొత్తపల్లి నాగరాజు అన్నారు. పాలకోడేరు రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి బి.సంధ్య అధ్యక్షతన బుధవారం రైతన్న మీకోసం గ్రామ స్థాయి కార్యాచరణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రానున్న ఐదేళ్లలో రైతును రాజును చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 5 విధానాల గురించి వివరించారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు గురించి వివరించి అవగాహన కల్పించారు. సందర్భంగా సొసైటీ ఛైర్మన్ కొత్తపల్లి నాగరాజు మాట్లాడుతూ రైతులను అన్ని విధాల ఆదుకోవాలని ముఖ్య ఉద్దేశంతో అనేక కార్యక్రమాలు ప్రభుత్వం చేపడుతుందని చెప్పారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ప్రభుత్వ ఆకాంక్షను నెరవేర్చాలని కోరారు. డిప్యూటీ తహశీల్దార్ ఎం.రఘు, రైతులు పాల్గొన్నారు.

పోడూరు: కూటమి ప్రభుత్వంతోనే రైతు సంక్షేమం సాధ్యమని పాలకొల్లు ఎఎంసి వైస్ ఛైర్మన్ దాసరి రత్నం రాజు అన్నారు. జున్నూరులో సచివాలయం–2 కార్యాలయంలో బుధవారం 'రైతన్నా మీ కోసం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నంరాజు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో శాస్త్రీయ మెలుకువలు పాటించడం ద్వారా పెట్టుబడులు తగ్గించుకునే దిగుబడులు పెంచుకునే విధంగా రైతులను చైతన్యపర్చేందుకు ప్రభుత్వం 'రైతన్నా మీకోసం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సొసైటీ ఛైర్మన్ దేవళ్ల ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు పెనుమత్స కాశీ విశ్వనాథరాజు, టిడిపి గ్రామ కార్యదర్శి గిరికి గోపాలకృష్ణ, పాలకొల్లు డిసి వైస్ ఛైర్మన్ శ్రీరామ కోటి మోహన్ పాల్గొన్నారు.

ఉండి: రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన రైతన్న మీకోసం కార్యక్రమం ఉండి రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి నిమ్మల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. రైతుల సంక్షేమం, అభివృద్ధి నిమిత్తం ప్రభుత్వం నిర్దేశించిన పంచ సూత్రాలు అయినటువంటి నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్‌పై వివరించారు. టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, పొత్తూరి వెంకటేశ్వరరాజు, ముదునూరి కృష్ణంరాజు మాట్లాడారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కలిదిండి రామకృష్ణంరాజు, ఎఎంసి సెక్రటరీ ఎన్.మావుళ్లు, ఉండి ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

తోపుడు బండి అందజేత

ప్రజాశక్తి – పాలకొల్లు

మాజీ సిఎం ఎన్‌టిఆర్ పొట్నూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనిశెట్టి అబ్బులు, ఆయన భార్య కుమారికి వీధిలో తిరిగి ఫ్యాన్సీ సామాన్లు అమ్ముకునేందుకు తోపుడు బండిని అందజేశారు. బండిని పొట్నూరి అప్పన్న కుమారులు పొట్నూరి సత్యనారాయణ, ప్రసన్న, పొట్నూరి కిరణ్ కుమార్, జయలక్ష్మి అందజేశారు.

వైసిపి నేతలను వేధిస్తే ఊరుకోం

మాజీ మంత్రి చెరుకువాడ శ్రీ రంగనాధరాజు

ప్రజాశక్తి – పోడూరు

సర్పంచులను, వైసిపి నాయకులను అధికారులు విచారణ పేరుతో వేధింపులు గురిచేస్తే చూస్తూ ఊరుకోబోమని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీ రంగనాధరాజు హెచ్చరించారు. తూర్పుపాలెం వైసిపి కార్యాలయంలో బుధవారం స్థానిక ప్రజా ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి సర్పంచులపై, వైసిపి నాయకుల పైన అనేక రకాలుగా విచారణ పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇటువంటి అనాలోచిత ఆరోపణలతో సర్పంచులను వేధింపులకు గురి చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ లో భాగంగా ఆచంట నియోజకవర్గంలో ఈ నెల 7వ తారీకు లోపుగా గ్రామాల వారీగా నియమించిన ప్రత్యేక ఇన్‌ఛార్జిలు ఆయా గ్రామాలకు వెళ్లి సంతకాల సేకరణ పూర్తి చేసి అందించాలని పిలుపునిచ్చారు. ఈనెల 10న జిల్లా పార్టీ కార్యాలయానికి కోటి సంతకాల నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి ప్రతి పక్ష నేత గుంటూరి పెద్దిరాజు, పెనుమంట్ర జెడ్‌పిటిసి కర్రి గౌరీ సుభాషిణి, ఎంపిపి కర్రి వాసు రెడ్డి, నేతలు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభ జయప్రదానికి ప్రచారం

ప్రజాశక్తి – వీరవాసరం

సిఐటియు అఖిలభారత మహాసభ ఈ నెల 31, జనవరి 1, 2, 3, 4 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్నాయని, మహాసభ జయప్రదానికి వివిధ రూపాల్లో ప్రచారం నిర్వహిస్తున్నామని సిఐటియు జిల్లా నాయకులు అంజనేయులు తెలిపారు. నవుడూరు బజార్ చెట్టు కార్మికుల సమావేశం బుధవారం నవుడూరులో జరిగింది. ఈ సందర్భంగా అఖిల భారత మహాసభ పోస్టర్‌ను విడుదల చేస్తూ సిఐటియు అఖిల భారత మహాసభ మన రాష్ట్రంలో జరగడానికి ఒక ప్రత్యేకత ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేస్తోందని, దీనివల్ల అభివృద్ధి కుంటుపడి ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులకు గురవుతారని తెలిపారు. చివరికి ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు పోరాటాల ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును కేంద్ర పాలకులతో చేతులు కలిపి అమ్మేయడానికి కూటమి పాలకులు ప్రయత్నాలు చేస్తున్నారని, వీటన్నింటినీ ప్రజానీకం వ్యతిరేకించాల్సి ఉందని అన్నారు. ఈ విధానాలపై అఖిల భారత మహాసభలు చర్చించబోతున్నాయని రానున్న కాలంలో మరిన్ని ప్రజా పోరాటాలు విస్తృతంగా జరుగుతాయని తెలియజేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి కార్మిక నేతలు ఈ మహాసభలో పాల్గొంటారని, నాలుగో తేదీన విశాఖ బీచ్‌లో పెద్ద ఎత్తున బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అలమహారాజు, గిద్ద శ్రీనివాస్, కనకరాజు పాల్గొన్నారు.

అందుబాటులో బరకాలు

ప్రజాశక్తి – పెనుమంట్ర

సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల్లో రైతులకు బరకాలు అందుబాటులో ఉంచినట్లు స్థానిక సహకార సంఘాల మండల లెవెల్ అధికారి ఎం.ఎం.రెహమాన్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశాలు, జిల్లా సహకార అధికారి ఆదేశాల మేరకు మండలంలోని 15 ఆర్‌ఎస్‌ఎల్లో, సహకార సంఘాలలో బరకాలను ఉంచినట్లు తలెఇపారు. మండల రైతులు వాటిని ఉపయోగించుకోవాలని కోరారు.

రైతులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి – పెనుగొండ

మారిన వాతావరణంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వారిని ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పెనుగొండ, దేవ గ్రామాల్లో పంట పొలాలను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. గోనె సంచులు అందక ముప్పు తిప్పలు పడుతున్నామని, దీంతో ధాన్యం రవాణా ఆలస్యం అవుతోందని రైతు తేతలి చిట్టి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వర్షానికి ధాన్యం తీసుకొచ్చే ట్రాక్టర్లు చేలల్లో దిగబడి తిరగడం లేదని, దానివల్ల ఎకరానికి రెండు గంటలు టైం పడుతోందని వెంకటేశ్వరరావు వద్ద రైతులు ఆవేదన చెందారు. వాయుగుండం కారణంగా ధాన్యం వర్షం నుండి కాపాడుకోడానికి, ఆరబెట్టుకోవడానికి బరకాలు లేవని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వట్టి మాటలు కట్టిపెట్టి రైతులకు మద్దతు ధర వచ్చే విధంగా దళారీ వ్యవస్థ నుండి కౌలు రైతులకు రక్షణ కల్పించాలని, దళారియే రేటు నిర్ణయించి ధాన్యం కొనుగోలు చేస్తున్నాడని, ప్రభుత్వమే నేరుగా ధాన్యం కొనాలని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. వర్షం వల్ల ధాన్యం మొక్కలు వస్తున్నాయని, ధాన్యం తేమ శాతం సడలించాలన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి – భీమవరం టౌన్

మాట్లాడుతున్న అనీల్‌కుమార్

స్టిక్ బుక్ సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ సిఇఒ జూపల్లి అనిల్‌కుమార్ బుధవారం ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కాలేజ్, యాజమాన్యం మరియు వివిధ విభాగాల అధిపతులతో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టిక్ బుక్ సిఇఒ అనీల్‌కుమార్ మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఇంజినీరింగ్ కాలేజీలను కొత్త టెక్నాలజీ ద్వారా అనుసంధానపరుస్తూ విద్యార్థులకు వివిధ ప్రాజెక్టులకు పరిచయం చేసి వారిలోని నైపుణ్యాలను ప్రతిభను గుర్తించి ఉద్యోగావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. తరువాత విద్యార్థులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. మీడియా ద్వారా అన్ని వర్గాలకు టెక్నాలజీని ఆరోగ్యకరమైన వాతావరణంలో అందించే లక్ష్యంతో ఏర్పాటు చేయడం జరిగిందని, దీన్ని అందరూ ఉపయోగించుకుని మెరుగైన సమాజ నిర్మాణానికి పాటుపడాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యం,ప్రొఫెసర్లు, ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు వెల్త్ సాయి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాయివర్మ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కెవి.రామచంద్రరావు పాల్గన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి

ప్రజాశక్తి – నరసాపురం

ఆధునిక పద్ధతులతో సాగుచేస్తే దిగుబడి మరింత పెరుగుతుందని టిడిపిపొత్తూరి రామరాజు అన్నారు. బుధవారం మండలంలోని తూర్పుతాళ్ళు గ్రామంలో రైతన్న మీ కోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులకు అండగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దానికి అనుగుణంగా రుణాలు, సబ్సిడీలు అందిస్తోందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, ఎఒ జ్యోషిలా, శాస్త్రవేత్త శ్రీనివాస్, వినయలక్ష్మి, సర్పంచి పద్మారావు, ఎంపిటిసి హనుమంతు, పి.రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి హయాంలోనే మద్యం ఏరులు

ప్రజాశక్తి – ఆచంట

గత వైసిపి ప్రభుత్వంలోనే కొడమంచిలిలో మద్యం ఏరులై పారిందని టిడిపి గ్రామ అధ్యక్షులు బాలం వెంకటరమణ విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొడమంచిలిలో బెల్ట్ షాపుల ద్వారా మద్యం ఏరులై పారుతోందంటున్న కొడమంచిలి వైసిపి నాయకులు వారి ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా నాయకులు, కార్యకర్తలు మద్యం పాటలపై రూ.50 నుంచి రూ.100 వసూలు చేసి ప్రజల సొమ్మును లూటీ చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో నకిలీ మద్యం సరఫరా చేసేవారు కూడా వైసిపి నాయకులేనని, వారిని కూటమి ప్రభుత్వం ఉక్కుపాదంతో అణిచివేసిందన్నారు. ఈ విషయాన్ని వైసిపి నాయకులు గుర్తు పెట్టుకోవాలని ఆయన హెచ్చరించారు.

ప్రభుత్వాసుపత్రిలోనే ప్రసవాలు సురక్షితం

ప్రజాశక్తి – ఆచంట

ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు సురక్షితంగా జరుగుతాయని ఆచంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ వై.అనూష అన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో ప్రసూతి వైద్యాధికారి ఎస్.శిరీష, పిల్లల వైద్యాధికారి ఆర్.లలితారాణి బుధవారం నూతనంగా విధుల్లో చేరారని, ఆచంట మండల పరిసర ప్రాంత ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఎక్సరే స్కానింగ్, ఇసిజి అధునాతనమైన ల్యాబ్ టెస్టులు అందుబాటులో ఉన్నాయన్నారు.కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలందిస్తున్నట్లు ఆమె వివరించారు.

నేడు ఉచిత కేన్సర్ నిర్ధారణ శిబిరం

తణుకు: తణుకు స్వర్ణ లయన్స్ క్లబ్, చిట్టూరి సుజాత ఆర్థిక సహకారంతో ఈనెల 4వ తేదీ గురువారం జిల్లా పరిషత్ ఉన్నత(బాలుర) పాఠశాలలో ఉచిత కేన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్ ఎపి సేవా యజ్ఞం కోఆర్డినేటర్ చిట్టూరి సుజాత, జోన్ లయన్స్ జోన్ ఛైర్‌పర్సన్ కోగూరి పద్మావతి తెలిపారు. బుధవారం స్థానిక లిటిల్ పారడైజ్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చిట్టూరి సుజాత, కోగూరి పద్మావతి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా, భారతదేశంలో కేన్సర్ కేసులు వేగంగా పెరుగుతున్నాయన్నారు. తొలిదశలో స్క్రీనింగ్ టెస్టులు చేస్తే కేన్సర్‌ను 90శాతం వరకు నియంత్రించొచ్చని తెలిపారు. 30 ఏళ్లు పైబడినవారు, ముఖ్యంగా పొగతాగేవారు, మద్యపానం చేసేవారు ప్రతి సంవత్సరం తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరాన్ని ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, సతీమణి కృష్ణ తులసి దంపతులు ప్రారంభిస్తారని తెలిపారు. తణుకు స్వర్ణ లయన్స్ క్లబ్ అధ్యక్షులు బూరుగుపల్లి వెంకట్రావు, ట్రెజరర్ గొరస దుర్గామహేష్ పాల్గొన్నారు.

మాజీ సైనిక కుటుంబాల సంక్షేమానికి ముందుకు రావాలి

ప్రజాశక్తి – భీమవరం

మాజీ సైనికుల కుటుంబాల సంక్షేమానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. దానికి కలెక్టరేట్లో ఈనెల 7న సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా వాల్ పోస్టరు, స్టిక్కర్లను కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆవిష్కరించి సాయుధ దళాల పతాక నిధికి తమ మొదటి విరాళం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత సైనికదళాల దేశభక్తి, సాహసం, త్యాగాల పట్ల దేశం గర్విస్తోందన్నారు. ఇటీవల జరిగిన ఆపరేషన్ సింధూర్‌లోనూ, ప్రకృతి వైపరీత్యాల సమయంలోను, దేశ సరిహద్దులు, వెలుపల మన సైనికుల ధైర్యసాహసాలకు దేశం గర్విస్తోందన్నారు. ప్రజలు అందించే విరాళాలు జిల్లా సైనిక సంక్షేమ అధికారి, పశ్చిమ గోదావరి జిల్లా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అక్కౌంట్ నెం.62068471992, ఐఎఫ్‌ఎస్‌సి కోడ్ ఎస్‌బిఐఎన్ 0012722కు పంపుతూ, జిల్లా సైనిక సంక్షేమాధికారి మొబైల్ నెం.8688817953 ఈమెయిల్ zswowgoap@gmail.com జిల్లా వారికి తెలియజేయలన్నారు. జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి ఎస్.కొండలరావు, ఎక్స్ జెడబ్ల్యూఒ డివి.రామయ్య, ఎ.వీరయ్య, ఎన్‌సిసి క్యాడెట్స్ పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసానికి సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి – పాలకొల్లు

ఎఎస్‌ఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరుగుతున్న 7 రోజుల ప్రత్యేక శిబిరంలో భాగంగా బుధవారం కార్యక్రమాలు ఉత్సాహభరితంగా నిర్వహించారు. అడవిపాలెం ఎంపిపి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన ముగింపు సభకు కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభా అభివృద్ధికి, వ్యక్తిత్వ వికాసానికి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. వాలంటీర్లు సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిడిపి అడవిపాలెం గ్రామ అధ్యక్షుడు చెరుకూరి అంజిబాబు విచ్చేసి విద్యార్థులను, వాలంటీర్లను ప్రోత్సహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, ఐక్యు ఎసి కోఆర్డినేటర్ కె.భద్రాచలం, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఎం.రామకృష్ణ, వి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి – భీమవరం

రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలకు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఎంపికైనట్లు కౌశల్ జిల్లా కోఆర్డినేటర్ రేపాక వెంకన్న బాబు, జాయింట్ కోఆర్డినేటర్ జి.శ్రీనివాస్ వర్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. భారతీయ విజ్ఞాన మండలి, ఎపి సైన్స్ సిటీ, అప్ కాస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి కౌశల్ ప్రతిభా అన్వేషణ ఆన్‌లైన్ పోటీలో ప్రతిభ కనబర్చి మన జిల్లా విద్యార్థులు 12 మంది రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఎనిమిదో తరగతిలో మీసాల ఎస్‌వికె.ప్రశాంత్ (ప్రభుత్వ ఉన్నత పాఠశాల అత్తిలి), బి.షణ్ముఖ ప్రియ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కుముదవల్లి), టి.లక్ష్మీ కళ (జెడ్‌పి హైస్కూల్ కొడమంచిలి), కటకం హెచ్‌ఎన్‌వి.సుదీప్ (ప్రభుత్వ ఉన్నత పాఠశాల,అత్తిలి), 9వ తరగతిలో ఎం.దుర్గాభవాని (జెడ్‌పి హైస్కూల్, వెంప), జి.జోషిని (జెడ్‌పి హైస్కూల్, గూట్లపాడు), పెదపూడి చాందిని (జెడ్‌పి హైస్కూల్, కొడమంచిలి), టి.లోహిత (జెడ్‌పి హైస్కూల్ గూట్లపాడు), 10వ తరగతిలో ఐ.రక్షిత శ్రీనాగవైష్ణవి (జెడ్‌పి హైస్కూల్, కొమ్ముచిక్కాల), కె.లావణ్య (జెడ్‌పి హైస్కూల్, కొడమంచిలి), ఎస్.సతీష్ (ప్రభుత్వ ఉన్నత పాఠశాల అత్తిలి), పి.ఆనంద్ బాబు (జెడ్‌పి హైస్కూల్, కొడమంచిలి) రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాకరినత ఎలిపారు. ఎంపికైన వారందరికీ అభినందనలు తెలిపారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి – నరసాపురం

బాల్య వివాహాలపై బుధవారం పట్టణంలోని లెనిన్, మిషన్ హైస్కూల్లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్నతనంలో వివాహాలు చేసుకోవడం వల్ల కలిగే అనార్థలపై విద్యార్థులకు సూపర్ వైజర్ ఎన్ పద్మావతి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థుల హక్కులు, విధులు, మహిళ చట్టాలు, కిశోర బాలికలు తీసుకోవాల్సి ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి నహేమియా, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్వా సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి – మొగల్తూరు

వాతావరణ మార్పులతో చెరువుల్లో రొయ్యల రైతులు నష్టాల బారిన పడే ప్రమాదం ఉందని యాజమాన్య పద్ధతుల పాటించడం ద్వారా నష్ట నివారణ చేయొచ్చని మత్స్యశాఖ ఎడి ఎల్‌ఎల్‌ఎన్.రాజు అన్నారు. ఆక్వా చెరువుల్లో నీటిని 60 శాతం కంటే తక్కువ ఉండేలా చూసుకోవాలని, వర్షపాతం వల్ల చెరువులో నీటిలో లవణీయత తగ్గుదల కారణంగా బోర్ నీటిని పెట్టడానికి మినరల్ బ్యాగులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. నీటి ఉష్ణోగ్రత తగ్గితే క్విక్ లైమ్, అగ్రి లైమ్‌ను ఎకరానికి రెండు బస్తాలు వేయాలన్నారు. ఏరియేటర్లు లేని చెరువులకు అదే వాటర్‌ను ఆయిల్ ఇంజిన్లతో చెరువులోకి తోడాలని సూచించారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి : కలెక్టర్

ప్రజాశక్తి – పెనుగొండ

బాగా చదివిన వారికే రెసిడెన్షియల్ పాఠశాలలో అవకాశాలు వస్తాయని, కష్టపడి చదివి, జీవితంలో క్రమశిక్షణతో మెలగాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి విద్యార్థులకు సూచించారు. పెనుగొండలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను బుధవారం కలెక్టర్ నాగరాణి ఆకస్మికంగా సందర్శించారు. పిల్లలు ఎవరన్నా రక్తహీనతతో ఉన్నారా, తాగునీరు ఏం ఉపయోగిస్తున్నారు, పిల్లలు చిక్కీ తింటున్నారా, పిల్లలకు ఏం మెనూ ఇస్తున్నారు, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ కిట్‌లను పిల్లలకు అందజేశారా లేదా అడిగి తెలుసుకున్నారు. వంట పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంటున్నాయా లేదా అని పరిశీలించారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ బాగా చదివే వారికే రెసిడెన్షియల్ పాఠశాలలో అవకాశాలు వస్తాయన్నారు. కష్టపడి చదువుకోవాలని, అర్థం చేసుకుని చదివితే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ఒక క్రమశిక్షణతో నడపడానికి ఎంతో ఓర్పు, సహనం అవసరం అన్నారు. తల్లిదండ్రులను బాగా చూసుకోవాలన్నారు. అనవసర అలవాట్లకు దూరంగా ఉండి లక్ష్యంపై దృష్టి పెట్టాలని ప్రేరణనిచ్చారు. అనంతరం ఓజోన్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సైన్స్ ఒలింపియాడ్ జాతీయ స్థాయి డ్రాయింగ్ పోస్టర్ మేకింగ్ పోటీలో ప్రతిభ కనబర్చిన విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసిరాజు, తహశీల్దార్ జి.అనిత కుమారి, స్కూల్ ప్రిన్సిపల్ ఎన్.సుభాషిణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో వ్యక్తి అరెస్ట్

పాలకొల్లు : పాలకొల్లు టిడ్కో గృహాల వద్ద సంచలనం సృష్టించిన మహిళ రాధ హత్య కేసులో సహజీవనం చేస్తున్న తాడి సుధాకర్ ముద్దాయిగా భావించి అతనిని బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె కుమార్తె భవ్యశ్రీ ఇచ్చిన స్టేట్మెంట్ ఆధారంగా సుధాకర్‌ను అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ పృధ్వీ మీడియాకు తెలిపారు. అతనిని కోర్టుకు హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

తాడేపల్లిగూడెం: ప్రజలకు ఆరోగ్య ఇబ్బందులు తలెత్తకుండా చూడడమే ఎన్‌డిఎ ప్రభుత్వ లక్ష్యమని, జిల్లాలో అత్యధిక చెక్కులు ఇచ్చిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అని బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తాతాజీ పేర్కొన్నారు. బుధవారం ఎంఎల్‌ఎ శ్రీనివాస్ కార్యాలయం వద్ద సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 13 లక్షల రూపాయల చెక్కులను కూటమి నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా తాతాజీ మాట్లాడారు.

మారిన వాతావరణం : రైతుల ఆందోళన

ప్రజాశక్తి – ఇరగవరం

మండలంలో ముమ్మరంగా సాగుతున్న ఖరీఫ్ మాసూళ్లకు దిత్వా తుపాను ప్రభావంతో మారిన వాతవరణం అవరోధం కలిగించింది. మొన్నటి వరకూ ఒక పక్క వరి చేల కోతలు, మరో పక్క గట్టుకు చేర్చిన ధాన్యంలో తేమ శాతం తగ్గించుకునేందుకు ఎండబెట్టేవారు. ధాన్యాన్ని రైస్ మిల్లులకు రవాణా చేసుకుంటున్న తరుణంలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకొని చిరుజల్లులు కురవడంతో మాసూళ్ల నిలిచిపోయాయి. పంటను రక్షించుకునేందుకు ధాన్యపు రాశులను బరకాలతో కప్పుతున్నారు. మాసూళ్ల ఖర్చులు పెరిగిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరగవరం, కె.ఇల్లిందలపర్రు, రాపాక, రేలంగి, కంతేరు, కాకిలేరు, కత్తవపాడు, కొత్తపాడు, గోటేరు, అయితంపూడి, ఒగిడి గ్రామాల్లో పెద్ద ఎత్తున వరిసాగు జరుగుతోంది. ఇప్పటికి సుమారు 8 వేల ఎకరాల్లో వరి మాసూళ్ల పూర్తయ్యాయి. వ్యవసాయాధికారి రాఘవేంద్రరావు పంట పొలాల్లో పర్యటించి రైతులకు తగు సూచనలు ఇచ్చారు.

మొగల్తూరు : వాతావరణ మార్పులతో వ్యవసాయ, ఇతర రంగ కార్మికులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుపాను ప్రభావంతో మండలంలోని గ్రామాల్లో బుధవారం కూడా వాతావరణం అనుకూలంగా లేదు. దీంతో వరి రైతులు కోతల కోసేందుకు వెనకాడుతున్నారు. రైతు కూలీలకు పనులు ఉండడం లేదు. వర్షాల ప్రభావంతో చెరువుల వద్దకు రవాణా వాహనాలు చేరుకోకపోవడంతో పట్టుబడులు నిలిచిపోయాయి. దీంతో మత్స్యకారులు ఇతర రంగానికి చెందిన కార్మికులు పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

IN THE COURT OF THE III ADDL. DISTRICT JUDGE, KAKINADA
O.S.No.86/2018
Between:
Anupoju Satyanarayana ...Plaintiff
and
Mathurthi Ratna Kumari & others ...Defendants
To: Defendants:
8) Mathurthi Satish, S/o. Vara Prasad (Late), Marteru Village, Tanuku Mandal, West Godavari District.
11) Edurubathi Nagamani @ Nagu, W/o. Venkateswara Rao, House wife, Bhimavaram Town, West Godavari District.
12) Gorse Ammaji, W/o. Rambabu, House wife, Palangi, Tanuku Mandal, West Godavari District.
పై నెంబరు దావాలో 8, 11, 12వ ప్రతివాదులు అయిన మీకు ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది.**08-12-2025** సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ **10.30** ని॥లకు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టువారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేనియెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
T.V. నరసింహారావు
అడ్వకేట్, కొత్తపేట, సెల్: 984908395

పాస్‌పోర్టు పోయినది
పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం, కొబ్బరితోట, డోర్‌నెం.12-2-141/2, కాపురస్తులు ఆకుల శ్రీను, S/o.పైడియ్య అను నాకు Passport No.X0760231 Issued by Passport Office, Visakhapatnam. అను నెంబరు గల ఒరిజినల్ పాస్‌పోర్టు కలదు. ది.23-11-2025 తేదీన మా ఇంటి వద్ద నుండి మెయిన్ బజార్ తాడేపల్లిగూడెం వద్ద గల జిరాక్స్ సెంటర్‌కు జిరాక్స్ తీయించు నిమిత్తం వెళ్ళుచుండగా దారి మార్గము మధ్యలో ఒరిజినల్ పాస్‌పోర్టు ఉన్న కవరు జారీ పడిపోయినది. ఎంత వెతికినను దొరకలేదు. ఎవరికైన దొరికినచో ఈ క్రింది అడ్రస్సుకు తెలియజేయగలరు.
ఆకుల శ్రీను, S/o.పైడియ్య, డోర్‌నెం.12-2-141/2, కొబ్బరితోట, తాడేపల్లిగూడెం, పశ్చిమ గోదావరి జిల్లా.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు : నంద్యాల
O.S. No: 95/2021
కెనరా బ్యాంక్ (ఈ-సిండికేట్ బ్యాంక్), ఆర్.యస్.రోడ్ బ్రాంచ్ మేనేజర్, నంద్యాల. ...వాది
మరియు
1. M/s. Royal Enterprises
బిన్నీ కాంప్లెక్స్, మెయిన్ రోడ్, నూనెపల్లి, నంద్యాల
2. యస్.కే. మొహమ్మద్ మౌలాలి
తండ్రి హుస్సేన్ సాహెబ్, ఇంటి నెం.5-27, వేలంపేట, రామాలయం దగ్గర, చింతలపూడి మండలం, ఎర్రగుంటపల్లి, వెస్ట్ గోదావరి జిల్లా- 534 460.
...ప్రతివాదులు
పైన తెలిపిన వాదికి రావలసిన బాకీ మొత్తం రాగోరి నంద్యాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో పైన తెలిపిన ప్రతివాదులు పైన ఒక దావా దాఖలు చేసి ఉన్నారు. సదరు దావాలో ప్రతివాదులు అయిన మీకు ఎన్నిమార్లు సమన్లు పంపించినా అవి తీసుకోవడానికి మీరు అందుబాటులో లేనందున కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఈ పత్రికా ప్రకటన ద్వారా ప్రతివాదులు అయిన మీకు సమన్లు జారీ చేయడమైనది. కావున ప్రతివాదులు అయిన మీరు 18-12-2025 తారీఖున ఉదయం 10:30 గం.. కాలములో పైన తెలిపిన కోర్టులో స్వయంగా కానీ ఒకీలు ద్వారా కాని హాజరు అయి ఏవేని ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకోనవలయును. అట్లు లేని యెడల మీ పరోక్షమున దావాను తీర్మానించబడునని ఇందు మూలంగా తెలుయజేయడమైనది.
(కోర్టువారి ఉత్తర్వు మేరకు)
వాయిదా : 18-12-2025
ఇట్లు
యన్. శ్రీనివాసులు బాబు,
వాదిపరం అడ్వకేట్,
నంద్యాల.

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) తాడేపల్లిగూడెం వారి కోర్టులో
I.A.179/2024 in O.S.92/2009
Between:
కుంచె భరత్ సింహ ...పిటీషనర్
And
కుంచె దీపికసింహ్ వగైరా ...రెస్పాండెంట్స్
పై నెంబరు పిటీషను గ్రంథములో 9th రెస్పాండెంట్ అయిన మరిడి హరీష్ చౌదరి, S/o.వరప్రసాద్, Male, Age 42 Yrs, Business, Plat No.302, రవిప్లాజా, రామచంద్రరావుపేట, ఏలూరు జిల్లా అను మీకు శ్రీకోర్టు వారి ద్వారా ఎన్నిపర్యాయములు నోటీసు పంపించిననూ మీరు తీసుకొనక తప్పించుకుని తిరుగుతున్నారు. పై నెంబరు పిటీషను ది.17-12-2025 తేదీన వాయిదా అయి ఉన్నది. కావున మీరు స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ ది.17-12-2025 తేదీన ఉదయం 10.30 ని॥లకు శ్రీకోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షముగా సదరు పిటీషను తీర్మానము జరుగునని యిందుమూలముగా తెలియజేయడమైనది.
తాడూరి లీలామాధవ్, అడ్వకేట్
తాడేపల్లిగూడెం తాడేపల్లిగూడెం
తేది.3-12-2025 సెల్: 9346409563

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) తాడేపల్లిగూడెం వారి కోర్టులో
I.A.180/2024 in O.S.92/2009
Between:
కుంచె భరత్ సింహ ...పిటీషనర్
And
కుంచె దీపికసింహ్ వగైరా ...రెస్పాండెంట్స్
పై నెంబరు పిటీషను గ్రంథములో 9th రెస్పాండెంట్ అయిన మరిడి హరీష్ చౌదరి, S/o.వరప్రసాద్, Male, Age 42 Yrs, Business, Plat No.302, రవిప్లాజా, రామచంద్రరావుపేట, ఏలూరు జిల్లా అను మీకు శ్రీకోర్టు వారి ద్వారా ఎన్నిపర్యాయములు నోటీసు పంపించిననూ మీరు తీసుకొనక తప్పించుకుని తిరుగుతున్నారు. పై నెంబరు పిటీషను ది.17-12-2025 తేదీన వాయిదా అయి ఉన్నది. కావున మీరు స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ ది.17-12-2025 తేదీన ఉదయం 10.30 ని॥లకు శ్రీకోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షముగా సదరు పిటీషను తీర్మానము జరుగునని యిందుమూలముగా తెలియజేయడమైనది.
తాడూరి లీలామాధవ్, అడ్వకేట్
తాడేపల్లిగూడెం తాడేపల్లిగూడెం
తేది.3-12-2025 సెల్: 9346409563

మహారాజశ్రీ 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తణుకు కోర్టులో
ఈ.పి.నెం.61/2022 ఇన్ ఓ యస్.నెం.436/2020
బిట్వీన్ :
పడాల శ్రీనివాసరెడ్డి ...డిహెచ్ఆర్
మరియు
షేక్ సుభాన్ సాహెబ్ అనే సుభాన్ ...జెడిఆర్
తండ్రి : షేక్ యూసఫ్ సాహెబ్, డోర్‌నెం.2-131, పంచాయితీ ఆఫీస్ వెనుక, సిద్ధాంతం – 534326, పెనుగొండ మండలం, ప.గో.జిల్లా,
తణుకు 4వ అదనపు జిల్లా జడ్జి కోర్టు
డిహెచ్ఆర్ తరపున దాఖలు చేసిన ప్రకటన
ది.09-05-2022 గల డిక్రీ బాకీ మీ ఆస్తి (సిద్ధాంతంలో 416 చ.గ.ల స్తలం, అందులో డోర్‌నెం.2-131, 2-132రు గల ఇళ్ల నందు మీ సగ భాగం) జప్తు, దర్మిలా వేలం వేసి వసూలు చేయుటకు ఈపి దాఖలు చేయగా మీకు వేలం నోటీసులు అమలు జరుగనందున, శ్రీకోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా మీకు సేల్ నోటీసు ఆర్డర్ వేసినారు. కావున ది.11-12-2025 ఉదయం 10.30 గం.లకు మీరు పైకోర్ట్ ఎదుట హాజరు కాని ఎడల మీ పరోక్షమునందు ఈపి తీర్మానం జరుగునని తెలియజేయడమైనది.
గోటేటి భాస్కరమూర్తి,
గోటేటి సత్యవెంకట వరప్రసాద్,
తణుకు అడ్వకేట్స్,
ది.01-12-2025 తణుకు, ప.గో.జిల్లా.